క్లుప్తంగా

వలంటీర్ల ఉద్యమానికి అండగా నిలవాలి



మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్): ఎన్నికల ముందు గ్రామ/వార్డు వలంటీర్లను కొనసాగిస్తామని, రూ.10 వేలు వేతనం ఇస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వారిని తొలగించి మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ విమర్శించారు. వలంటీర్ల ఉద్యమానికి వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతుగా నిలవాలని కోరారు. గురువారం స్థానిక సి క్యాంపులోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు 2.60 లక్షల మంది వలంటీర్ల కడుపు కొట్టిన ప్రభుత్వంపై ఉద్యమ బాట పట్టనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరుద్యోగులకు అండగా నిలవాలన్న సంకల్పంతో వలంటీర్లను నియమించి గౌరవ వేతనం ఇచ్చారన్నారు. అయితే మాజీ ముఖ్యమంత్రి ఉద్యోగాలు ఇచ్చాడన్న అక్కసుతో కూటమి ప్రభుత్వం వారిని తొలగించడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ నేరవేర్చేంత వరకు వలంటీర్లు చేపట్టే ఆందోళన కార్యక్రమాలకు పూర్తి అండగా ఉంటామన్నారు. న్యాయమైన డిమాండ్‌పై వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు వారికి మద్దతుగా నిలవాలని కోరారు.

శనగలో పంటకోత ప్రయోగం



పోలకల్‌లో దిగుబడిని తూకం వేస్తున్న అధికారులు

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో వ్యవసాయ అధికార యంత్రాంగం శనగలో పంటకోత ప్రయోగం చేపట్టారు. గురువారం ఏఎస్‌ఓ ఆదినారాయణ ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులు, సిబ్బంది గ్రామంలోని పచ్చర్ల తిరుమలేష్‌కు చెందిన సర్వే నంబర్ 422లోని శనగ పైరులో పంట కోత ప్రయోగం చేపట్టారు. 5-5 చదరపు మీటర్ల విస్తీర్ణంలో పంట కోత చేపట్టగా దిగుబడి 2.810 కేజీలు వచ్చింది. ఈ మేరకు ఎకరానికి 4.5 క్వింటాళ్ల దిగుబడి సాధ్యమవుతుందని, ఇది సాధారణ దిగుబడిగా ఉంటుందని ఏఎస్‌ఓ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఈఓ వెంకటేశ్వర్లు, వ్యవసాయ సహాయకులు ఆఫ్రీన్, ఊర్మిళ, వీఆర్‌ఏలు, రైతులు ఉన్నారు.

ఘనంగా మౌలాలిస్వామి జార్తలు



అలంకరణలో మౌలాలి, దస్తగిరి స్వామి పీర్లు

పాణ్యం: మండల పరిధిలోని కొలురు గ్రామంలో మౌలాలి, దస్తగిరి స్వామి వార్ల జార్తలు ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి పీర్ల చావిడి వద్ద ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని రాత్రి వరకు చక్కెర చదివింపులు చేయించారు. అలాగే జార్తల సందర్భంగా గ్రామంలో బొమ్మల దుకాణాలు, చిన్నపిల్లల క్రీడా దుకాణాలు వంటివి వెలిశాయి. జార్తలు పురస్కరించుకొని పీర్లకు ప్రత్యేక పూల అలంకరణ, నూతన వస్త్రాల అలంకరణ చేపట్టారు. రాత్రి ప్రత్యేక ఫాతేహాలు చేశారు. తెల్లవారుజామున గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతి అర్జీని పరిష్కరించండి

గడివేముల: రెవెన్యూ సమస్యలపై వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించాలని నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్ సూచించారు. ఆయన గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీలను, రెవెన్యూ సదస్సులోని సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రతి రెవెన్యూ ఉద్యోగి సమయ పాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ, ఆర్ఐ ఎల్లా సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుల ఎన్నిక

కల్లూరు: పాణ్యం నియోజకవర్గంలోని కల్లూరు అర్బన్, కల్లూరు గ్రామీణ, ఓర్వకల్లు మండలాలకు అధ్యక్ష ఎన్నికలు కల్లూరు అర్బన్‌లోని ఓ ప్రైవేటు స్కూల్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లూరు అర్బన్‌-1 ఎస్.రామాంజనేయులు, కల్లూరు గ్రామీణ మండలానికి ఎస్.మధుకుమార్, ఓర్వకల్లు- ఎం.రఘురాముడులను మండలాల అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ నాయకులు గీతా మాధురి, చెన్నయ్య, నాగరాజుయాదవ్ తెలిపారు. ఎన్నికైన వారికి పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు మద్దిలేటి రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, గంగాధర్, దిలీప్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

థైరాయిడ్‌తో పెను ముప్పు

- శారీరక, మానసిక సమస్యలతో సతమతం
- జిల్లాలో 15 శాతం మందికి సమస్య
- మందులు, వ్యాయామంతో నియంత్రణ
- జనవరి థైరాయిడ్ అవగాహన మాసం



కర్నూలు(హాస్పిటల్): ఏ చిన్న పని చేసినా అలసిపోతారు. చిన్న విషయానికీ కోప్పడతారు. చిన్న వయస్సులోనే కీళ్ల నొప్పులు బాధిస్తాయి. ఉన్నఫలంగా బరువు పెరుగుతారు లేదా తగ్గిపోతారు. జీవితంలో ఏదో కోల్పోయిన ఆలోచనలు నిత్యం వెంటాడుతుంటాయి. ఇలాంటి లక్షణాలు మీలో ఎవరికైనా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి థైరాయిడ్ పరీక్ష చేయించుకోండి. ఇది దీర్ఘకాలిక సమస్య. ఒక సారి ఈ వ్యాధి వచ్చిందంటే జీవితాంతం మందులు వాడాల్సిందే. లేకపోతే నిత్యం ఏదో ఒక ఆరోగ్య సమస్య తలెత్తుతుంది. జనవరి నెల థైరాయిడ్ అవగాహన మాసం సందర్భంగా ప్రత్యేక కథనం.

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎండోక్రైనాలజీ విభాగానికి ప్రతి మంగళ, శుక్రవారాలు ఓపీ సేవలు ఉంటాయి. ఇందులో థైరాయిడ్ రోగులు ప్రతి మంగళవారం 100 మంది, ప్రతి శుక్రవారం 50 మంది చికిత్స కోసం వస్తారు. వీరితో పాటు వివిధ విభాగాల నుంచి ప్రతిరోజూ పది మంది దాకా రెఫరల్స్ వస్తారు. వీరిలో గైనకాలజీ విభాగం నుంచి గర్భవతులు ఎక్కువగా ఉంటారు. పెద్దాసుపత్రితో పాటు ప్రైవేటు వైద్యుల వద్దకు సైతం ప్రతిరోజూ 150 నుంచి 200 మంది దాకా థైరాయిడ్ బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. ఈ మేరకు వారి వద్దకు సగటున నెలకు 3 వేల మంది చికిత్స పొందుతున్నారు. మొత్తం థైరాయిడ్ రోగుల్లో 70 శాతం మంది హైపో థైరాయిడ్, 30 శాతం మందికి హైపర్ థైరాయిడ్ బాధితులు ఉంటున్నారు. ఈ ఆరోగ్య సమస్య పిల్లల నుంచి పెద్దల వరకు బాధిస్తోంది. స్త్రీలలో 20 శాతం, పురుషులలో 15 శాతం మంది ఈ వ్యాధికి గురవుతున్నారు. వీరిలో కొందరికి గాయిటర్ (గొంతు వద్ద గడ్డ) ఉంటోంది. ఇలా కణితి ఉన్న వారికి ఆపరేషన్ అవసరం లేదు. క్యాన్సర్‌గా మారితేనే ఆపరేషన్ చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. గడ్డలు ఏర్పడ్డ వారిలో 5 శాతం మందిలో మాత్రమే క్యాన్సర్ కణితులు ఉంటాయి. వీరికి మాత్రమే ఆపరేషన్ చేసి కణితి తొలగించాల్సి ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

పుట్టబోయే పిల్లలకు సమస్యలు

ఇటీవల కాలంలో గర్భిణుల్లో థైరాయిడ్ సమస్య బాగా ఇబ్బంది పెడుతోంది. గర్భిణిగా ఉన్నప్పుడు ఈ సమస్యను గుర్తించకపోతే వారికి పుట్టబోయే బిడ్డలకు భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వారిలో మేధోపరమైన సమస్యలు, ఎదుగుదల లోపాలు, శారీరక, మానసిక సమస్యలు వస్తాయని చెబుతున్నారు. కావున గర్భం దాల్చిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా థైరాయిడ్ పరీక్ష చేయించుకుని, వ్యాధి ఉంటే వైద్యుల సూచన మేరకు మందులు వాడాల్సి ఉంటుంది.

అయోడిన్ ఉప్పును వాడాలి



అయోడిన్ ఉప్పు సరిగ్గా వాడకపోయినా థైరాయిడ్ జబ్బు వస్తుంది. ఇప్పటికీ గ్రామాల్లో రాళ్ల ఉప్పు వాడుతున్నారు. అయోడిన్ కలిపిన ఉప్పునే కొని వాడాలి. ఉప్పు ఉంచిన డబ్బాను ఎప్పుడూ మూసి ఉంచాలి. లేకపోతే అయోడిన్ గాలిలో కలిసిపోతుంది. థైరాయిడ్ సమస్య ఉన్న వారు క్యాబేజీ, క్యాలీఫ్లవర్‌కు దూరంగా ఉండాలి. ఈ వ్యాధి బాధితులు వైద్యులు సూచించిన ప్రకారం మందులు వాడుతూ ఉంటే ఏమీ కాదు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో థైరాయిడ్ పరీక్ష ఉచితంగా నిర్వహిస్తున్నాం. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నాం. **–డాక్టర్ పి.శ్రీనివాసులు, ఎండ్రోక్రైనాలజీ విభాగాధిపతి, జీజీహెచ్, కర్నూలు**

థైరాయిడ్ కణితిని నిర్లక్ష్యం చేయరాదు



థైరాయిడ్ బాధితుల్లో చాలా మందికి గొంతు వద్ద ఎలాంటి సమస్యా ఉండదు. కొందరికి మాత్రమే కణితి ఏర్పడి వాపు కనిపిస్తుంది. ఇది చిన్న సైజులో ఉన్నా, దాని వల్ల ఎలాంటి ఇబ్బంది లేకపోయినా మందులు వాడుతూ ఉంటే సరిపోతుంది. ఇలాంటి వారికి ఆపరేషన్ అవసరం లేదు. కణితి సైజు పెద్దగా ఉండి, క్యాన్సర్ లక్షణాలు ఉంటే మాత్రం వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించుకుని, ఆపరేషన్ ద్వారా కణితిని తొలగించుకోవడం మంచిది. లేకపోతే క్యాన్సర్‌గా మారి తీవ్ర ఇబ్బందులకు గురిచేసే ప్రమాదం ఉంది. **– డాక్టర్ ఏఎస్ భార్గవవ్యాస్, జనరల్, ల్యాప్రోస్కోపిక్ సర్జన్, కర్నూలు**

డ్రైనేజీ ధ్వంసంపై ఫిర్యాదు



ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న బ్రాహ్మణదొడ్డి గ్రామస్తులు

సి.బెళగల్: గ్రామంలో డ్రైనేజీని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మారందొడ్డి వాసులు అధికారులను కోరారు. ఈ మేరకు గ్రామానికి చెందిన రాఘవేంద్ర, జిక్రియ, మల్లికార్జున, నరసింహుడు, తదితరులు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తంకు అర్జీ ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వే నంబర్ 310లో గత 15 సంవత్సరాల క్రితం ఇళ్లను నిర్మించుకుని నివాసం ఉంటున్నామని, సదరు నివాస స్థలాలకు సరైన డ్రైనేజీ లేకపోవడంతో సర్పంచ్ శాంతమ్మ తాత్కాలిక డ్రైనేజీ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారన్నారు. అయితే తాత్కాలిక డ్రైనేజీని కొంతమంది ధ్వంసం చేయడంతో మరోసారి మురుగునీటి సమస్య ఏర్పడిందన్నారు. డ్రైనేజీని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు అర్జీ ఇచ్చారు. గ్రామస్తులు మధు, సుంకులమ్మ, ఉపేంద్ర, చిన్న మద్దిలేటి, లోకేంద్ర, భాస్కర్ తదితరులు ఉన్నారు.

కురువ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

గడివేముల: మండల కేంద్రంలో గురువారం ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి రంగస్వామి ఆధ్వర్యంలో కురువ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 20 సంవత్సరాల నుంచి కురవ సంఘం క్యాలెండర్లను ప్రచురిస్తున్నట్లు చెప్పారు. గ్రామాలలో కురువ కులస్తులందరూ ఏకమై తమ ఉనికిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే ఉన్నత చదువులు చదువుకున్న కురువ విద్యావంతులు వెనకబడిన వారిని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేలా కృషి చేయాలన్నారు. కురవలందరూ ఐకమత్యంగా ఉంటే ఏ రాజకీయ పార్టీ అయినా తగిన గుర్తింపునిచ్చి చట్ట సభలలో రాణించేందుకు అవకాశం కల్పిస్తుందని, దీన్ని కురువ కులస్తులందరూ గుర్తుంచుకోవాలన్నారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామితో పాటు వెంకటేశ్వర్లు, బాల తిమ్మయ్య, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యుడు పాపారాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



కార్మికులతో కలిసి ఆందోళన చేపట్టిన విద్యార్థి సంఘం నాయకులు

ఓర్వకల్లు: మండలంలోని గుట్టపాడు వద్ద స్థాపిస్తున్న స్టీల్ ప్లాంట్ పరిశ్రమలో కాంట్రాక్టు కింద పనిచేస్తున్న ఎంఆర్ కంపెనీ గుర్తింపును రద్దు చేయాలని సీపీఐ, ఆర్‌వీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఎంఆర్ కంపెనీలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారికి నెల రోజులుగా జీతాలు చెల్లించలేదని గురువారం స్టీల్ ప్లాంట్ ఎదురుగా చేపట్టిన ఆందోళనకు సీపీఐ, ఆర్‌వీఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంఆర్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికుల జీతాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆ కంపెనీలో వంద మందికి పైగా ఉద్యోగాలు ఇచ్చారని, అయితే ఇంతవరకు జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగాలని చెప్పి, అక్కడ మాత్రం వేరే పనులు చేస్తున్నారని, జీతాలు ఇవ్వకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి బైక్‌లపై వచ్చే వారికి కనీసం పెట్రోల్‌కు కూడా డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కంపెనీ యాజమాన్యం, ఉన్నతాధికారులు స్పందించి, కార్మికులకు నెలకు రూ.16 వేలు చొప్పున వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే అన్ని ప్రజా సంఘాలను కూడగట్టి ఆందోళనను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కంపెనీ ప్రతినిధులు స్పందించి నెలకు రూ.15 వేలు వేతనం చెల్లించి, పెట్రోల్ ఖర్చులు ఇస్తామని భరోసా ఇచ్చారు. దీంతో కార్మికులు ఆందోళనను విరమించారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి సుధాకర్, ఆర్‌వీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మామిడి తోటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి దివ్య

పాణ్యం: మామిడి రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల ఉద్యావన అధికారి దివ్య సూచించారు. గురువారం పాణ్యంలో మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం మామిడి పూతలు ఆలస్యమవుతున్న తరుణంలో రైతులు తాము సూచించిన మందులను పిచికారీ చేయాలన్నారు. తోటలకు 13.0.45 రకం 10 గ్రాముల సూక్ష్మదాతు మిశ్రమాన్ని 2 గ్రాములు ఒక లీటర్‌తో నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. 25 శాతం పూత దశలో ఉన్న తోటల్లో బ్రాసినోలిడ్ ఒక ఎంఎల్, ఇమిడాక్లోపిడ్ 0.5 ఎంఎల్ ఒక లీటర్‌కు 2 ఎంఎల్ చొప్పున కలిపి పిచికారీ చేసుకుంటే పూత వచ్చేందుకు అవకాశం ఉందని, మారుతున్న వాతావరణం కారణంగా రైతులు సకాలంలో మందులను పిచికారీ చేయాలన్నారు. అనంతరం తోటల రైతులకు సూచనలు ఇచ్చారు. ఉద్యానవన అధికారి ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.



ఆర్.కొంతలపాడులో బురదమయంగా రోడ్డు

పడకేసిన పారిశుద్ధ్యం

కర్నూలు(రూరల్): గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. మండలంలోని ఆర్.కొంతలపాడు గ్రామం కురువ కాలనీలో మురుగు నీరు ఇళ్ల ముందే రోడ్డుపై పారుతుండటంతో దుర్గంధం వెదజలుతోంది. దీంతో ఆ కాలనీ మీదుగా వెళ్లాలంటే ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. మురుగు నీటి వల్ల దోమలు, విషకీటకాల బారిన పడి ప్రజలు అనారోగ్యానికి గురౌతున్నారు. సమస్యను విన్నవించినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

- ఇసుక పాలసీ, భూముల రీసర్వేపై సభ్యుల ప్రశ్నల వర్షం
- సమాధానాలు చెప్పలేక సాకులు చెప్పిన అధికారులు



సమావేశంలో డీటీ రామాంజనేయులును ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, ఎంపీటీసీ సందప్ప

కోడుమూరు రూరల్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వే, ఆన్‌లైన్ ఇసుక విధానాన్ని తప్పుబట్టిన కూటమి ప్రభుత్వం తిరిగి భూముల రీసర్వే, ఆన్‌లైన్ ఇసుక విధానాన్ని అమలు చేస్తుండటంలో ఆంతర్యమేమిటని కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, ప్యాలకుర్తి ఎంపీటీసీ సందప్ప డీటీ రామాంజినేయులును ప్రశ్నించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాడి రూతమ్మ అధ్యర్యంలో ఎంపీడీఓ రాముడు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ రామాంజనేయులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో మండలంలో 5 గ్రామాల్లో భూముల రీసర్వే నిర్వహించామని, మిగిలిన గ్రామాల్లో కూడా త్వరలో మళ్లీ రీసర్వేను నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందన్నారు. అయితే గతంలో నిర్వహించిన రీసర్వే తప్పుబట్టి నానా హంగామా చేసిన సీఎం చంద్రబాబు నాయుడు తిరిగి రీసర్వే ఎలా చేపడుతున్నారని, గతంలో తప్పు అని చెప్పిన విధానం ఇప్పుడు ఎలా కరెక్ట్ అవుతుందో చెప్పాలంటూ జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, ఎంపీటీసీ సందప్ప ప్రశ్నించగా డీటీ సమాధానం చెప్పలేక పోయారు. అలాగే మీకు అనువుగా ఉన్న వాగులు, వంకలు, నదుల్లో ఎక్కడి నుంచైన ఇసుకను ఫ్రీగా తెచ్చుకోవచ్చని ముఖ్యమంత్రి సభలు పెట్టి చెబుతున్నారని, అయితే హంద్రీ నుంచి ఇసుక తెచ్చుకుంటే పోలీసులు ట్రాక్టర్లను సీజ్ చేస్తున్నారని, కోడుమూరు ప్రజలకు ఇసుక పాయింట్ ఎక్కడ కేటాయించారో చెప్పాలని జెడ్పీటీసీ రెవెన్యూ, పోలీస్, ఎంపీడీఓలను ప్రశ్నించగా.. తమ పరిధిలో లేదంటే, లేదంటూ ఒక శాఖపై ఒకరు చెప్పుకోవడం గమనార్హం. మూడు శాఖల అధికారులు సమావేశమై చర్చించుకుని ఎక్కడి నుంచి ఇసుక తెచ్చుకోవాలో చెప్పాలని జెడ్పీటీసీ కోరారు.

ఆర్‌అండ్‌బీ ఏఈ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మండలంలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేశామని, కోడుమూరు నుంచి వెల్దుర్తికి రోడ్డు వేసేందుకు ప్రతిపాదనలు పంపామని చెప్పగా, గత 6 నెలల నుంచి ఇదే మాట చెబుతున్నారని, అసలు ఆర్‌అండ్‌బీ అధికారులు పనిచేస్తున్నారా లేదా అని సభ్యులు ప్రశ్నించారు. ఏపీఎం సుబ్బయ్య మాట్లాడుతూ.. కోడుమూరులో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌లో ఆడిట్ జరుగుతోందని, ఆడిట్ పూర్తయిన తర్వాతే తాను మార్ట్ బాధ్యతలు చూస్తానని చెప్పగా, ఆడిట్ ఎప్పుడు పూర్తవుతుంది, ఏమైనా నిధులు గోల్‌మాల్ జరిగాయా అని సభ్యులు ప్రశ్నించడంతో త్వరలో పూర్తవుతుందంటూ సమాధానం దాటవేశారు. ఏఈఓ బాలక్రిష్ణ మాట్లాడుతూ.. రబీ సీజన్‌కుగాను పంటలు సాగు చేసిన రైతులంతా వెంటనే పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఏపీఓ మోదీన్‌బాషా మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు ముందుకొస్తే ఉపాధి కింద నీటి నిల్వగుంతలు, కత్వాల ఏర్పాటు చేయిస్తామన్నారు. కూలీల సంఖ్య పెంచడంతో పాటు గ్రామాల్లో మేటీలను నియమిస్తున్నామన్నారు. ఎంపీడీఓ రాముడు మాట్లాడుతూ సభలో సభ్యులు లేవనెత్తిన సమస్యలన్నింటినీ ఆయా శాఖల అధికారులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. సభలో పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు గంగరాజు, ప్రసాద్, సీడీపీఓ వరలక్ష్మి, ఈఓఆర్డీ మంజుల, ఎంఈఓ తైమూర్‌బాషా, ఆరోగ్య, అగ్నిమాపక దళం, పశువైద్య శాఖలకు సంబంధించిన అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. మండల ఉపాధ్యక్షురాలు మాధవి, ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కల్లూరు: విద్యుత్ శాఖలో చేపట్టనున్న అభివృద్ధి పనులలో భాగంగా శుక్రవారం కల్లూరు మండలం దూపాడు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దూపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని తిరుమలగిరి టౌన్ షిప్, గ్రీన్ ల్యాండ్, కృతింగా హోటల్, లక్ష్మీపురం, దూపాడు గ్రామాల్లోని తదితర కాలనీలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సి.బెళగల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తిమ్మారెడ్డి వాహనదారులను హెచ్చరించారు. ఆయన గురువారం పోలీస్ సిబ్బందితో కలిసి మండల కాంప్లెక్స్ వద్ద గూడూరు – ఎమ్మిగనూరు ప్రధాన రోడ్డుపై వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలు పాటించని 11మంది వాహనదారులపై కేసు నమోదు చేసి, రూ. 1,350 జరిమానా విధించారు. ట్రాఫిక్ నిబంధనలపై ఎస్ఐ వాహనదారులకు అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని శాంతిరామ్ ఆసుపత్రి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు హైవే పోలీసులు గురువారం తెలిపారు. వారు తెలిపిన మేరకు వివరాలు.. రుద్రవరం గ్రామానికి చెందిన రమిజాబీ, పుట్టన్న, సమీరా కొలురు గ్రామంలో జరిగే జార్తలకు వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొనడంతో పుట్టన్న, సమీరాకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న హైవే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

శీతాకాలం.. వ్యాధుల భయం



సీజనల్ జబ్బులతో పోలకల్ పీహెచ్‌సీకి వచ్చిన వృద్ధులు



పీహెచ్‌సీకి చికిత్స కోసం వచ్చిన జ్వరం బాధితులు

- పెరుగుతున్న సీజనల్ వ్యాధులు
- వృద్ధులు, చిన్నారులకు తప్పని అవస్థలు
- అప్రమత్తం అవసరం అంటున్న వైద్యులు

సి.బెళగల్: వాతావరణ మార్పులతో ఇటు చిన్నారులు, అటు పెద్దలు అనారోగ్య సమస్యలతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో వృద్ధులు, చిన్నారులు జలుబు, దగ్గు, జ్వరం, ఉబ్బసం తదితర శీతాకాల సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. గత నెలలో పట్టుకున్న తుపాన్ల ప్రభావం అనంతరం గ్రామాల్లో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గి చలి తీవ్రత పెరుగింది. దీంతో ఉదయం 7 గంటల వరకు మంచు తెరలు వీడటం లేదు. అదే విధంగా సాయంకాలం 5 గంటల నుంచే చలి మొదలై రాత్రి 9 గంటలకు మంచు కమ్ముకుంటూ చలిగాలులు వీస్తున్నాయి. శీతాకాలంలో వాతావరణ మార్పులతో వచ్చే జబ్బుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

పెరుగుతున్న జలుబు, దగ్గు, జ్వరం బాధితులు

గ్రామాల్లో శీతల గాలులతో సీజనల్ వ్యాధులైన జలుబు, దగ్గు, జ్వరాల కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. మండల కేంద్రం సి.బెళగల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ), మండలంలోని పోలకల్ పీహెచ్‌సీలోనూ రోజువారి కేసుల సంఖ్య పెరగడం శీతాకాల సీజనల్ వ్యాధుల వ్యాప్తికి నిదర్శనంగా నిలుస్తోంది. సి.బెళగల్ పీహెచ్‌సీలో రోజు సగటున చిన్నారులు 12 నుంచి 18 మంది, వృద్ధులు 22 నుంచి 25 కేసులు నమోదవుతున్నాయి. అదేవిధంగా పోలకల్ పీహెచ్‌సీలో చిన్నారులు 15 నుంచి 25, వృద్ధులు 35 నుంచి 55 కేసులు నమోదవుతున్నాయి. గతంలో రెండు పీహెచ్‌సీలలోనూ సగటు కేసులు చిన్నారులు 10 నుంచి 15 వరకు, వృద్ధులు 12 నుంచి 18 మధ్య నమోదయ్యేవి. ఇప్పుడు ఒక్కసారిగా కేసులు పెరిగాయి.

చిన్న పిల్లలు జాగ్రత్త

చిన్నారులలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తి, జబ్బులకు గురయ్యే అవకాశం పిల్లల్లో అధికంగా ఉంటుంది. శిశువులకు తల్లిపాలు శ్రేష్ఠమైనవి. వేడి చేసి చల్లార్చిన నీటినే తాపించాలి. అలాగే ఉదయం, సాయంత్రం మంచు ఉన్నప్పుడు తల, శరీరానికి ఉన్ని దుస్తులు ధరించడం మంచిదని వైద్యులు అంటున్నారు. వాటితో పాటు పౌష్టికాహారం అందించడం, పిల్లలు అనారోగ్యంతో ఉన్నప్పుడు సొంత వైద్యం మానుకుని వెంటనే ఆసుపత్రిలోని వైద్యులను సంప్రదించి చికిత్స అందించడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.


చర్మ సంరక్షణపై జాగ్రత్తలు అవసరం

శీతాకాలంలో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చర్మ వ్యాధులు అధికమయ్యే అవకాశం ఉంది. విటమిన్ డీ లోపంతో దద్దుర్లు, చర్మం పగుళ్లు వస్తాయి. అదే విధంగా తామర వంటి చర్మ సమస్యలు తీవ్ర ఇబ్బందులు పెడతాయి. అందుకే చలికాలంలో బయట తిరిగేటప్పుడు చర్మంపై దుమ్ము, ధూళి పడకుండా తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. వైద్యులను సంప్రదించి స్కిన్‌లోషన్లను వినియోగించాల్సి ఉంటుంది. చర్మ ఆరోగ్య సమస్యలకు చర్మ వ్యాధి నిపుణులను సంప్రదించాలి.

ఆస్తమా బాధితులు అప్రమత్తంగా ఉండాలి

పోషకాహార లోపంతో పిల్లలు, పెద్దలలో ఆస్తమా వ్యాధి వృద్ధి చెందుతుంది. ఈ వ్యాధిగ్రస్తులు ముఖ్యంగా జలుబు, దగ్గు సమస్యలతో బాధపడుతుంటారు. జ్వరం 102 డిగ్రీల వరకు చేరడం, కోరింతదగ్గు, ముక్కు నుంచి నీరు కారడం వ్యాధి లక్షణాలుగా ఉంటాయి. 40 ఏళ్ల వయస్సు పైబడిన వారిలో ఈ లక్షణాలు అధికంగా కనబడతాయి. ఈ సీజన్‌లో వీరు అప్రమత్తంగా ఉండాలి. దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఉండటం మంచిది. అత్యవసర పరిస్థితిలో వెళ్లినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరోగ్య సమస్యలు వచ్చిన వెంటనే దగ్గర్లోని ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకొని వైద్యం పొందాలి.

జాగ్రత్తలతో వ్యాధులను నివారించవచ్చు



ప్రతి సీజన్‌లో వాతావరణ మార్పులతో జబ్బులు వస్తుంటాయి. వైరల్ ఫీవర్‌తో పాటు మరికొన్ని ముందు నుంచి ఉన్న జబ్బులు (పాత జబ్బులు) సైతం సీజనల్‌గా ఇబ్బందులు పెట్టే అవకాశం ఉంది. అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల సీజనల్ వ్యాధులను నివారించుకోవచ్చు. ఇప్పటివరకు మండలంలో నమోదవుతున్న సీజనల్ జ్వరాలలో ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు లేవు. **– డాక్టర్ మిథున్‌కుమార్‌రెడ్డి, సి.బెళగల్ పీహెచ్‌సీ వైద్యులు**

పిల్లలు, వృద్ధులు జాగ్రత్త



పిల్లలకు శీతాకాలంలో వెచ్చని దుస్తులు తొడగడంతో పాటు, వేడి చేసి చల్లార్చిన నీటిని తాపాలి. అదేవిధంగా వీలైనంతవరకు చల్లని ఆహార పదార్థాలు, పానీయాలకు దూరంగా ఉంచాలి.అలాగే చలి తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో వృద్ధులు బయటకు రాకుండా ఉండటం మంచిది. ఆస్తమా, అలర్జీ ఉన్నవారు మందులను క్రమతప్పకుండా వాడాలి. చలికాలంలో పిల్లలు, వృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. **– డాక్టర్ శ్రావణి, పోలకల్ పీహెచ్‌సీ వైద్యులు**